ధరలక్ష్మీ వ్రతం

- చుక్కలనంటిన ధరలు
- హడలిపోతున్న వినియోగదారులు
- భారంగా పూజాసామగ్రి కొనుగోలు



ఆనందపురంలో విక్రయిస్తున్న చెరకు, అరటి మొక్కలు, ఆకులు

తగరపువలస: మండుతున్న నిత్యావసర సరకులు, బంగారంతో సమానంగా పూజాసామగ్రి ధరలు ఆకాశన్నంటడంతో ఈసారి సామాన్య ప్రజలకు వరలక్ష్మి వ్రతం భారంగా మారుతోంది. ఇంట్లో ఒక్కరోజు పూజకు ఖర్చు రూ.వేలల్లో ఉండడంతో అటు కొనలేక.. ఇటు ఉండలేక పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పువ్వుల ధరలకు రెక్కలు

- కిలో చామంతులు బుధవారం రూ.500కే లభించగా గురువారం ఏకంగా రూ.700 నుంచి రూ.900కు చేరుకున్నాయి.
- అలంకరణకు వినియోగించే 20 లైన్లు కలిగిన బంతిపూల పుట్టీలు సాధారణ రోజుల్లో రూ.200 కే లభించగా వరలక్ష్మి పూజ ప్రభావంతో ఏకంగా రూ.900కు విక్రయించారు.
- కలువ, తామర పువ్వులకు రూ.50 ఇచ్చి కొందామన్నా డిమాండ్ కారణంగా అందుబాటులో లేవు.
- మూర తులసిమాల రూ.100, అరటిమొక్క రూ.100, చివరకు మామిడి ఆకులు, గరిక, అరటి ఆకులు కూడా రూ.50 నుంచి రూ.100కు విక్రయమయ్యాయి.
- సాధారణ రోజుల్లో మందారాలు రూ.10కు 20కి విక్రయించగా పండగ కారణంగా మందార, చామంతి పువ్వులు విడిగా ఒక్కొక్కటి రూ.2కు అమ్ముడుపోయాయి.

పండ్లదీ అదే దారి..

పండ్ల ధరలు విందామన్నా హడలిపోయే పరిస్థితి. బత్తాయి రూ.30, యాపిల్, దానిమ్మ, చెరకు ముక్క రూ.50 వంతున ధరలు ఫిక్స్ చేశారు. కొబ్బరికాయ రూ.50, డజను అరటిపండ్లు రూ.100కు విక్రయించారు.



తగరపువలస మెయిన్‌రోడ్డులో పూజా సామగ్రి విక్రయం

పండగలు గడిచేదెలా..

రెండు నెలలుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆకుకూరలు, కూరగాయల ధరలు పైపైకి చేరాయి. తినడానికే కష్టంగా ఉంటే ఇక వరుస పండగలు ఎలా చేయగలమని జనం కలవరపడుతున్నారు. రానున్న రాఖీ పౌర్ణమి, కృష్ణాష్టమి, వినాయకచవితి, విజయదశమి పండగలను తలచుకుని బెంగ పెట్టుకుంటున్నారు. వరలక్ష్మి పూజల నుంచి గట్టెక్కే మార్గం కోసం వెతుకుతున్నారు. సాధారణ ప్రజలు ఆధారపడి ఉన్న ప్రస్తుతం రైతు బజారులోనే కిలో టమాటా రూ.49, వంకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.66, చిక్కుడు రూ.90, వెల్లుల్లి రూ.75, దొండ రూ.34 వంటి కాయగూరలు ధరలు మండుతున్నాయి. ఆకుకూరల కట్టలను సైతం రూ.3 నుంచి రూ.5కు పెంచేశారు. ప్రస్తుతం వర్షాలు కురిస్తే తప్ప వీటి ధరలు అందుబాటులోకి రావంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి నెలా ఏదో ఒక ఆర్థిక లబ్ధి చేకూరేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇస్తామన్న సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో అప్పులు చేసి పూజలు చేయవలసిన పరిస్థితి ఎదురయిందని వాపోతున్నారు.




ఆనందపురం పువ్వుల మార్కెట్‌లో రద్దీ



వేములవలస మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల చామంతులు

రూ.2వేలు పెట్టినా పూజా సామగ్రి రాలేదు



గతంలో రూ.500 నుంచి రూ.1000తో వరలక్ష్మి వ్రతం గట్టెక్కేది. ఈ సారి రూ.2వేలు తీసుకువెళ్లినా పూజా సామగ్రి రాలేదు. ఇంకా చీర అదనం. పిండివంటల ఖర్చు సరేసరి. మూడు వారాలలో వినాయక చవితి వస్తుంది. మళ్లీ ఖర్చులు తప్పవు.

– జీరు గంగాభవాని, జీరుపేట


ఏమీ కొనలేకపోతున్నాం



ఆగస్టు నెల వచ్చిందంటే వర్షాల కారణంగా ఆకుకూరలు, కూరగాయలు పుష్కలంగా పండి ధరలు అందుబాటులో ఉండేవి. ఇదేమి మాయో గాని వర్షాలు లేక, పువ్వులు, కూరగాయలు, ఆకుకూరలు కూడా కొనలేని పరిస్థితి ఉంది.

– కాకి వరలక్ష్మి, సంతపేట

ఉద్యోగస్తులకూ కష్టమే..



పెరిగిన పూజాసామాగ్రి, నిత్యావసర సరకులు కొనుగోలు చేయలేక అందరూ సతమతమవుతున్నారు. కూలి పనులు చేసుకునే వారి దగ్గర నుంచి ఉద్యోగస్తుల వరకు ఇదే పరిస్థితి. ఇక అద్దె ఇళ్లల్లో ఉన్నవారి ఇబ్బందులు మరీ అధికం. సింపుల్‌గా పూజలు చేసుకోవడం మినహా ప్రత్యామ్నాయం కనిపించడం లేదు.

– శీరపు భాస్కరరావు, తగరపువలస

సంక్షేమ పథకాలు అందితే కొంత మేలు



ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ప్రస్తుతం సంక్షేమ పథకాలు పడకేశాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25 వేల నుంచి రూ.80 వేలకు వచ్చేవి. ఆర్థిక ఇబ్బందులు ఉండేవి కాదు.

– ముని రమేష్, చిట్టివలస

క్లుప్తంగా

డబుల్‌డెక్కర్ బస్సుల తరలింపు

కొమ్మాది: బ్యాటరీతో నడిచే డబుల్‌డెక్కర్ బస్సులకు షెల్టర్ వసతి లేక గురువారం సింహాచలం ప్రాంతానికి తరలించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బ్యాటరీతో నడిచే డబుల్‌డెక్కర్ బస్సుల డిపో సాగర్‌నగర్ సమీపంలో బీచ్ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఇటీవల ఏర్పాటు చేశారు. ఈ బస్సులకు చార్జింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఈ బస్సులకు షెల్టర్ నిర్మించకపోవడంతో ఎండ తీవ్రతకు బ్యాటరీ బస్సులు పాడవుతున్నాయి. ఈ నేపథ్యంలో సింహాచలం తరలించారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు

పద్మనాభం: ఉద్యానవన పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని గుంటూరు కమిషనరేట్ కార్యాలయ ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కోరాడ, రెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. అరటి, బొప్పాయి విస్తరణ పథకాన్ని, హైబ్రిడ్ కాయగూరల సమగ్ర వ్యవసాయాన్ని, ఆయిల్‌పామ్ కొత్త తోటల పెంపకాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అరటి తోటలను పరిశీలించి, మాట్లాడారు. ఉద్యానవన పంటల సాగుకు రైతులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.శ్యామల, భీమిలి ఉద్యానవన శాఖ అధికారి బి.భానుపుష్ప లీలావతి, వీఆర్పీ శ్రీను పాల్గొన్నారు.

పాము కాటుకు రైతు బలి



నరిసింగరావు(ఫైల్)

పద్మనాభం: మండలలోని కోరాడలో పాముకు కాటుకు గురై రైతు బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ గ్రామానికి చెందిన పాండ్రంగి నరిసింగరావు(43) బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో తన బెండ తోటలోకి వెళ్లాడు. తోటలో బెండ కాయలు కోసి గట్టు మీదకు చేరుకున్నాడు. గట్టు మీద ఉన్న పాము నరిసింగరావు కుడి కాలుపై కాటేసింది. చికిత్స కోసం రేవిడి పీహెచ్‌సీకి తీసుకు వెళ్లారు. పరిస్థితి విషమించడంతో విజయనగరం మహారాజు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే నరిసింగరావు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై మృతడు కుమారుడు సతీష్ పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నరిసింగరావుకు భార్య, తల్లి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కూలిన కల్వర్టు గోడ



కూలిన కల్వర్టు గోడ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ కూడలి వద్ద కల్వర్టు రక్షణ గోడ కూలిపోయింది. గురువారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా ఈ రక్షణ గోడ కూలిపోయింది. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న సిటు జిల్లా కార్యదర్శి మూర్తి

తగరపువలస: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సిటు జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. భీమిలి డివిజన్ ఆటో కార్మికులతో కలసి గురువారం చిట్టివలస బంతాటమైదానం నుంచి ర్యాలీ, అంబేడ్కర్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన తరుణంలో ఆటో కార్మికుల ఉపాధి గురించి చెప్పాలన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి జీవో నంబర్ 20ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. జిల్లా ఆటో కార్మిక సంఘం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం ద్వారా ఏటా రూ.15వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, చిల్ల శివారెడ్డి, పల్లా పెంటరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

భీమునిపట్నం: మన దేశంతో పాటు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో క్రైస్తవులపై దాడులు అధికమవుతున్నాయని, వాటిని ప్రభుత్వాలు అరికట్టి తగిన చర్యలు తీసుకోవాలని పాస్టర్లు కోరారు. భీమిలి బీచ్‌రోడ్డులోని నజరేతు ప్రార్థనా మందిరంలో గురువారం నిర్వహించిన పాస్టర్ల ఐక్య సమావేశంలో రాష్ట్ర బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడు బిషప్ బాలరాజు మాట్లాడారు. క్రైస్తవులు సౌమ్యులని, ఎవరికీ ఇబ్బంది కలగకుండా ప్రార్థనలు నిర్వహించడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. కానీ, అటువంటి వారిని విమర్శించడం, దాడులకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయని ఇది దురదృష్టకరమని అన్నారు. ఇటీవల ఇక్కడ కూడా వేధింపులు జరిగాయని, ఇటువంటి వాటిపై ప్రభుత్వం స్పందించి తప్పు చేస్తున్నవారిపై తగిన చర్యలను తీసుకోవాలని కోరారు. ఉపాధ్యక్షుడు మోహన్‌కుమార్ కాటన్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ఉన్నారని, ఆయా పార్టీల వారు తమపై దాడులకు పాల్పడేవారిపై చర్యలు తీసుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు సంతోష్‌పాల్, డేవిడ్ ఇమాన్యుయల్, జాన్ స్టీఫెన్, జాకబ్ ప్రసాద్, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.



ఐక్య సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

25న క్రైస్తవుల జాతీయ స్థాయి సమావేశం

మధురవాడ: మధురవాడలో ఈ నెల 25న 'అన్యాయం–అక్రమం–అసమానత్వం' అనే అంశంపై జాతీయ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మధురవాడ ప్రాంతంలోని రాజధాని పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మధురవాడ వుడా కాలనీలో పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు ప్రేమ తరంత అధ్యక్షతన గురువారం నిర్వహించిన ప్రిపరేటరీ మీటింగ్‌లో వారు మాట్లాడారు.జాతీయ స్థాయి సమావేశాలకు విశ్రాంత అడిషనల్ డీజీపీ డాక్టర్ కూచిపూడి బాబూరావు, విశ్రాంత చీఫ్ సెక్రటరీ మిన్నీ మాథ్యూ వంటి వక్తలు హాజరు కానున్నారని తెలిపారు. క్రైస్తవ సంఘాల జాగరణ నిమిత్తం ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. డేనియల్ శ్యాం ఎస్.ఉష, తరంగ మనష్షే, రాణి గ్రే, బాలరాజు, శ్రీను, శామ్యూల్ సాంబ, ఎపఫ్రా రావాడ, జి.జయరాజు, జాకబ్ డేనియల్, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ ఫెస్ట్‌లో అలరించిన నాటకాలు

తగరపువలస: గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న హెరిటేజ్ ఫెస్ట్–2025లో భాగంగా గురువారం బాల బాలికలకు నాటకపోటీలు నిర్వహించారు. చుట్టుపక్కల 27 పాఠశాలలకు చెందిన సుమారు 350 మంది బాలబాలికలు పాల్గొని, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. రాధా మదన్ మోహన మందిరంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగిన ఈ నాటకపోటీలను తిలకించేందుకు ఉత్తరాంధ్ర నుంచి ప్రముఖులు విచ్చేశారు. ఈ నెల 11 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 9న వ్యక్తిగత, బృంద శాస్త్రీయ నృత్యాలు, 11న కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలలో పాల్గొనాలనుకునే ఆసక్తి గలవారు 99853 64430, 87901 60232 నంబర్లలో సంప్రదించాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస కోరారు.

కనులపండువగా ఝులన్ యాత్ర

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఝులన్ యాత్రలో భాగంగా గురువారం కూడా ఊయల సేవ నిర్వహించారు. ఈ ఝులన్ యాత్ర ఏకాదశి రోజు ప్రారంభమై పౌర్ణమి వరకు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని అంబరీష దాస తెలిపారు. రాధా మదన్ మోహన్ మందిరంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. రాధాకృష్ణుల విగ్రహాలను అందంగా అలంకరించిన ఊయలపై ఊపుతూ, వారి మధురలీలలను స్మరించుకున్నారు.

ఆర్థిక అంశాల్లో మహిళల ప్రతిభ అద్భుతం

తగరపువలస: ఆర్థిక అంశాల్లో మహిళలు అద్భుత ప్రతిభ కనపరుస్తున్నారని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఆనందపురం మండలం గంభీరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం జరిగిన విశాఖ మహిళా కో–ఆపరేటివ్ సొసైటీ రజతోత్సవ సభను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం 10 మంది మహిళా ఉద్యోగులతో ప్రారంభమైన సొసైటీ ప్రస్తుతం 10 బ్రాంచీలు రూ.100 కోట్ల టర్నోవర్ సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ ఎలమంచిలి ప్రసూనాంబ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ వైబీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విశాఖ మహిళా కో ఆపరేటివ్ సొసైటీ రజతోత్సవ సభను ప్రారంభిస్తున్న ఒడిశా గవర్నర్ హరిబాబు

కళాసాహితి ఆధ్వర్యంలో నాటిక పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే నాటిక పోటీలను ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ వర్మ తెలిపారు. ముఖ్యసభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమిలి మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ పోటీల్లో భీమిలి, తగరపువలస ప్రాంతాల నుంచి 11 పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో మాదక ద్రవ్యాల వల్ల నష్టం, సామాజిక మాధ్యమాలు, విద్య తదితర అంశాలపై నాటిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు. కోట య్య, మైలిపల్లి లక్ష్మణ రావు, సన్యాసినాయుడు, భీమారావు, గణపతి, కిశోర్, ఎర్రయ్యరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా వేళల మార్పు

పద్మనాభం: ఎండ తీవ్రత దృష్ట్యా వ్యవసాయ బోర్లకు ఓవర్ లోడ్ అవడం వల్ల తాత్కాలికంగా కొన్ని రోజులు గంధవరం, శిర్లపాలెం ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు వ్యవసాయ రంగానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా వేళల్లో తాత్కాలికంగా మార్పులు చేసినట్లు ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు ఇంతవరకు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తొమ్మిది గంటలు త్రీ ఫేజ్ నిర్విరామంగా సరఫరా చేసేవారమని తెలియజేశారు. శుక్రవారం నుంచి ఉదయం ఆరు గంటల నుంచి పది గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ పంపుసెట్లకు త్రీ ఫేజ్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పాలిథిన్ కవర్లు స్వాధీనం

తగరపువలస: పాలిథిన్ సంచులు వినియోగించే వ్యాపారులు, వినియోగదారులపై కఠిన చర్యలు చేపడతామని జీవీఎంసీ భీమిలి జోన్ శానిటరీ ఇనస్పెక్టర్ బి.మహలక్ష్మి నాయుడు హెచ్చరించారు. గురువారం చిట్టివలస, తగరపువలసలలో 15 దుకాణాలపై దాడులు నిర్వహించి, ఆరు కిలోల పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. రూ.1000 జరిమానా వసూలు చేశారు. ఇకపై పాలిథిన్ వినియోగంపై నిరంతరాయంగా దాడులు నిర్వహించి, భారీ జరిమానాలు విధించనున్నట్టు తెలిపారు. ఈ దాడులలో శానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అధ్యాపకుల నిరసన

భీమునిపట్నం: ప్రభుత్వం తమకు సాధారణ బదిలీలను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది గురువారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ చాలాఏళ్లుగా ఇక్కడ పని చేస్తున్నా, బదిలీలు జరగడం లేదని, దీనివల్ల ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం బదిలీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిరసనలో అధ్యాపకులు డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ సహదేవుడు, ప్రసాదరావు, వెంకటరావు, మాధురి పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే తీవ్ర పరిణామాలు

భీమునిపట్నం: విద్యార్థులు సహ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని భీమిలి క్రైం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సూర్యప్రకాశ్ అన్నారు. ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాల గురించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొందరు విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో కొత్తగా వచ్చే విద్యార్థుల పట్ల అమానుషంగా, వారిని అవమానపరిచే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని, వారు చదువుకునే అవకాశాన్ని కూడా కోల్పోతారని పేర్కొన్నారు. వారి భవిష్యత్తు నాశనమవుతుందని, ఇది ఏమాత్రం సరికాదని హితవు పలికారు. ర్యాగింగ్ అన్న ఆలోచన రాకుండా అందరూ క్రమశిక్షణతో చదువుకుని, మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికవ్యవస్థలో 'ఐఐఎం'లది కీలకపాత్ర

తగరపువలస: భారతదేశ జ్ఞాన ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకువెళ్లడంలో 'ఐఐఎం'లది కీలకపాత్ర అని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. గురువారం ఆయన ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంవీని గైడెడ్ టూర్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమకాలీన ఐఐఎంలలో గంభీరం ప్రథమ స్థానంలో ఉందన్నారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తింపు పొంది ఏటా 3 వేల మందికి పైగా వ్యక్తుల అభ్యాస ఆకాంక్షలను తీర్చడంతో పాటు ఆన్‌లైన్, బ్లెండెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా సేవలు అందిస్తున్నట్టు కొనియాడారు. ఎన్ఐఆర్ఎఫ్ వంటి జాతీయ ర్యాంకింగ్స్‌లో ప్రశంసనీయమైన పనితీరుతో సహా అనేక అంశాలలో ఐఐఎంవీ రాణించడం సంతోషదాయకమన్నారు. ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ కీలక మైలురాళ్లు, విద్యాపరమైన ఆఫర్లు, పరిశోధన విజయాలు, శక్తివంతమైన స్టార్టప్‌లు, పర్యావరణ వ్యవస్థ గురించి తెలిపారు. ఇటీవల రక్షణ రంగ వ్యవస్థ కోసం ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించినట్టు పేర్కొన్నారు.



గంభీరం ఐఐఎంవీ అధికారులతో సంభాషిస్తున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

బాలల సంరక్షణ కేంద్రానికి వితరణ

తగరపువలస: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు జ్ఞాపకార్థం ఆయన స్నేహితురాలు, రాష్ట్ర శిష్టకరణ సంఘం మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి గురువారం అనాథ బాలలకు రూ.10వేల విలువైన మెటీరియల్ అందించారు. భీమిలి మండలం తాళ్లవలసకు చెందిన భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రం చిన్నారులకు దుస్తులు, వాటర్ కేన్లు అందజేశారు. కార్యక్రమంలో వుయ్ కేర్ ఫర్ యు సొసైటీ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి ఉన్నారు.



బాలలకు దుస్తులు, వాటర్ కేన్‌లు అందిస్తున్న ప్రశాంతి

వేములవలసలో నిలిచిన ట్రాఫిక్

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలిలో రెండు రోజులుగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో సాధారణ ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వేములవలస మార్కెట్ రద్దీగా ఉంటోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు ఈ ప్రాంతంలో వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీంతో భీమిలి క్రాస్‌రోడ్డు, బోయపాలెం కూడలి వరకు రెండు రోజులుగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. హైవే విస్తరణకు ముందు విశాఖ నుంచి తగరపువలస వైపు వెళ్లే వాహనాలు నేరుగా ఫ్లై ఓవర్ మీద నుంచి వెళ్లిపోయేవి. హైవే విస్తరణ తరువాత వాహనాలను వేములవలస కూడలి ద్వారా మళ్లించడం వలన తరచూ ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనికి తోడు వేములవలస–పెందుర్తి మార్గంలో ఫ్లై ఓవర్ కింద వ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ పోలీసులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గాన్ని మారిస్తే తప్ప వేములవలస కూడలిలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించదని ఆనందపురం మండల ప్రజలు అంటున్నారు.



వేములవలస కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

పేకాట శిబిరంపై దాడి

తగరపువలస: ఆనందపురం మండలం భీమన్నదొరపాలెం గ్రామ పంచాయతీ శివారులోని బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆనందపురం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఆనందపురం ఎస్‌ఐ జి.సంతోష్, సిటీ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ఎం.భరత్‌కుమార్ రాజు సిబ్బందితో ఈ పేకాట శిబిరంపై దాడి చేశారు. వీరి నుంచి 52 పేకముక్కలు, రూ.56,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆనందపురం ఎస్‌ఐ పి.శివ కేసును దర్యాప్తు చేస్తున్నారు